# పిచ్చిపిట్టల రోడ్డు

డాక్టర్ వి. చంద్రశేఖరరావు

కలలు, నిద్ర పూర్తి అయినాక ఉదయాన్నే ఒక అద్భుతమైన ప్రపంచంలోకి నేను మేలుకొన్నట్లుగా తెలిసింది.

ఇంటి నిండా కథల వాసన.

సుందరం తాత వచ్చాడు. ఆయనొక సందడి. ఆయన్ని కథల తాత అని కూడా అంటాము. రోజూవారీ జీవితంలోంచి ఒక సంఘటనో, కబురో, మాటో పట్టుకొని కథను అల్లుతాడు. ఆయన రావడంతోటే ఇంటికి కొత్త ఊపిరి వచ్చింది. పక్షవాతంతో మంచానబడిన నాయనమ్మ ముఖంలో కళ వచ్చింది. ఇక తాతయ్య సరేసరి. అన్ని కరువు దిగుళ్లు మర్చిపోయాడు. అమ్మయితే గాలిలో తేలిపోతున్నట్టే ఉంది. ఒక్క నాయనే మూతి ముడుచుకొని ఉన్నాడు. (ఆ కాస్త పొలాన్ని అమ్మి హైదరాబాద్ రోడ్డుపై అడుగు పెడితేనే ఆ ముఖం విచ్చుకునేది.)

నా చిన్నతనమంతా సుందరం తాత కథల మీదుగానే నడిచింది. పొలం గట్ల మీద నడుస్తూనో, తూముల దగ్గర స్నానం చేస్తూనో, గుడిమెట్లపై కూలబడ్డప్పుడో, ఏ కాస్త సమయం దొరికినా ఆయన కథల్ని బయటకు లాగేవాడు. ఎదురుగా మనిషో, జంతువో, చెట్టో ఏది కనబడ్డా అదే కథ అయ్యేది.

ముతక పంచె, తెల్లని లాల్చి, ఆయన కథల్లోని పాత్రలాగే ఉండేవాడు. ఆయన్ని తలుచుకోగానే ముందుగా ఆయన కంఠస్వరం గుర్తుకొస్తుంది. మృదువుగా, గంభీరంగా మన లోపలికి దొలుచుకుపోతుందా స్వరం. చాలా కథలు సరదాగానే ఉంటాయి. నవ్వు పుట్టిస్తాయి. అప్పుడప్పుడు దిగులు కథలు కూడా చెపుతాడు. అట్లాంటి కథలు చెప్పేటప్పుడు ఎటోపైకి చూస్తూ ఒక గతాన్ని బయటకు లాగుతున్నట్లుగానో లేదా ఒక భవిష్యత్తును ముందే ఊహిస్తున్నట్లుగానో ఉంటుంది.

'ఒక సంగతి గుర్తుకొస్తుందిరా' అంటూ గట్టిగా ఊపిరి పీల్చేవాడు. అంటే ఒక కథ మొదలు కాబోతున్నదన్నమాట.

నేను నిద్ర లేచేసరికి, కథ వినబడుతూనే ఉంది. అమ్మ ఒక్కతే ఊ కొడుతుంది. తాత బయట గొడ్లను కడుగుతూ, దూరం నుంచే కథను వింటున్నాడు. నాయనమ్మ మంచంలోంచే గాజుకళ్లను తెరుస్తూ, ఆర్పుతూ కథను వింటోంది. నాయనే వరండాలో బీడీ కాలుస్తూ అసహనంగా, కోపంగా వంటగదిలో అమ్మ కాఫీ కలుపుతున్నట్లుగా ఉంది. మొరటుగా, ఘాటుగా ఉన్న కాఫీ వాసన ఇల్లంతా.

"కొండల మధ్య నుంచి వెళుతుంది రైలు..."

సుందరం తాత కథ మొదలైంది.

***

పొడవాటి సొరంగంలోంచి ఇనుప జంతువులా రొప్పుతూ వస్తుంది రైలు. చుట్టూ ఎండిపోయిన పొలాలు. ఎక్కడా మనుసుల జాడ లేదు. చెట్లకు జ్వరం సోకినట్లు వెచ్చటి గాలులు. రైలు గుప్పు గుప్పుమంటూ పొగలు కక్కుతుంది. "కిటికీలు మూయరా?!" ఆడమనిషి విసుక్కొంది. కిటికీలోంచి ముఖం పెట్టి చూస్తున్న కుర్రవాడు ఉలిక్కిపడ్డాడు. ఆ రైలు పెట్టెలో వాళ్లిద్దరే ప్రయాణీకులు. ఉదయం పదకొండు గంటలై ఉంటుంది. ఎండిన పొలాల్ని దాటుకొని, రైలు సిటీలోకి పరిగెడుతోంది.

కుర్రవాడికి పదేళ్ల వయసుంటుంది. (ఇంచుమించు మన ఎంకటిగాడి వయసు) ఆడమనిషికి ముప్పైయ్యేళ్లేగాని (మన రమణమ్మ వయసు), కళ్ల చుట్టూ రక్తనాళాలు ఉబ్బి, నల్లటి చారలేవో వెలసి, నడుము బాగా వంగిపోయి, వయసెంతో తెలియనట్లు కథల్లోని మనిషిలా వుంది.

రైలు అట్లా పరిగెడుతుండగా, కథ నగరంలోకి ప్రవేశించింది. నగరం విశాలమైన చెరువులా ఉంది. అందులో ఇళ్లు, అపార్టుమెంట్లు మృతదేహాల్లా వేలాడుతున్నాయి. అప్పుడు టైం పన్నెండు గంటలు. మామూలుగా నగరమంటే చప్పుడు, గందరగోళం కదా! ఆవేళ మాత్రం మాయ కమ్మినట్లుగా, నిశ్శబ్దంగా ఉంది. స్టేషనులో రైలు చాలాసేపు ఆగినా,



బొమ్మలు: శంభు



వాళ్లిద్దరూ దిగే ప్రయత్నం చెయ్యలేదు. తల్లి మాగన్నుగా ఉంది. సీటు నానుకొని నిద్రపోతుంది. జనమంతా దిగిపోయి, ట్రైను మాత్రం ఖాళీ అయ్యింది. స్టేషను బయట ఆటోలు, కార్లు, బస్సులు తిరుగుతున్నాయి గానీ చప్పుడు మాత్రం వినబడటం లేదు.

రైలు మళ్లీ కదిలింది. పది కిలోమీటర్ల దూరంలో నగరం లాంటి నగరమే ఇంకోటి ఉంది. ఇనుప బ్రిడ్జి, పెద్ద చెరువును (మన చెరువుకు వంద రెట్లు చెరువు) దాటుకొని రైలు రెండో నగరంలోకి చేరింది. ఇక్కడ రోడ్లు మాయమై మనుషుల గుట్టలే కనబడుతున్నాయి మనుషుల్ని వరుసగా పేర్చుకొంటూ పోయినట్లుగా, స్టేషను వచ్చినాక.

"దిగు, సంచి తీసుకో. దిక్కులు చూడకుండా అట్లా దక్షిణం వైపుకే నడువు" అంది తల్లి.

"నాయన దగ్గరకు పోవద్దా?" అన్నాడు కుర్రాడు.

క్షణం ఆగి "నాయన కూడా ఏమైనా చచ్చిపోయి ఉంటాడా?" అన్నాడు భయంతో కూడిన సందేహంతో. ఆమె ఏం మాట్లాడకుండా, ఒక హోటల్లోకి

నడిచి, టేబుల్‌పై నున్న నీళ్ల గ్లాసు తీసి కుర్రవాడికిచ్చి "తాగు, కడుపునిండా తాగు, ఆ తరువాత తాగటం కుదరదు" అంది.

వాళ్లిద్దరూ నడిచీ, నడిచీ రోడ్లు దాటి నగరం చివరిదాకా వచ్చారు. అక్కడో పెద్ద భవనం. 'నేనీ అండ్ నేని' అంటూ నియాన్ లైట్లతో దానిపైన బోర్డు మెరుస్తోంది. లోపలంతా పాలరాతితో పరచిన నేల. అటూ ఇటూ పూలమొక్కలు, కుండీలు, శిల్పాలు, అందచందాలు. అయితే భవనం అంతా నిశ్శబ్దంగా ఉంది. మాట్లాడటం నిషేదించబడ్డ చోటులా ఉంది. గేటు దగ్గర, అవతల తెల్లకోట్లు వేసుకొన్న మనుషులు, కేవలం సైగలు మాత్రం చేసుకుంటూ తిరుగుతున్నారు. ఒక గది దగ్గరకు వెళ్లి నిలబడింది తల్లి. టక్ టక్ మంటూ దానిపై కొట్టింది. ఆడమనిషి బయటకు తొంగి చూసింది.

"డాక్టరు కావాలి" అంది తల్లి.

"రెండు వందల యాభై" అంది నర్సు.

సంచీలోంచి డబ్బు తీసి ఇచ్చింది తల్లి. డబ్బులు ఇచ్చినాక వాళ్లను లోపలికి తీసుకెళ్లింది తెల్లదుస్తుల ఆడమనిషి. లోపల తెల్లగా, అదుపు లేకుండా పెరిగిన ఒక మనిషి తెల్లకోటుతో ప్రత్యక్షమయ్యాడు.

"ఎవరికి జబ్బు? ఏమిటి బాధ" అన్నాడు.

"జబ్బు కాదు. చావు. చచ్చిపోయిన మనిషికోసం వచ్చాం. వారం క్రితం ఇక్కడే చచ్చిపోయాడు."

డాక్టరు మార్చురీ వైపు నడిచాడు. "బిల్లులన్నీ కట్టారా?" అన్నాడు. ఆడమనిషి మాట్లాడలేదు.

"ఆ చచ్చిపోయిన మనిషి నా పెనిమిటి తండ్రి. వీడికి తాత. వీడికి ఆ మనిషంటే ప్రాణం. ఒకసారి వీడికి చూపిద్దామని."


"డబ్బులు కట్టినట్టే కదా" డాక్టరు మళ్లీ అడిగాడు. ఆడమనిషి మౌనంగా తల ఊపింది. మార్చురీ గది తెరిచి, ఆనవాళ్ల కోసం కాగితాలు, రిజిస్టరు వెతకసాగాడు డాక్టరు.

"బయట బాగా ఎండగా ఉంది. శవాన్ని ఇప్పుడే తీసుకెళతారా?" అన్నాడు డాక్టరు.

"మా మగమనిషి రావాలి" అంది గుంభనంగా.

"సరే, ముందు శవాన్ని గుర్తు పట్టండి. వెతుక్కుని రండి" అన్నాడు డాక్టరు బద్ధకంగా ఆవులిస్తూ. "బిల్లులు కట్టిన రసీదులు చూపిస్తే...." డాక్టరు మరోసారి గుర్తు చేశాడు.

సరిగ్గా వారం క్రితం, సోమవారం ఉదయాన చచ్చిపోయాడా మనిషి. అరవైయేళ్ల మనిషి. రైతు. పొలం అంతా అమ్ముకొని కొడుకు ఈ నగరానికే వచ్చాడు. హోటలో, కేఫో, రెస్టారెంటో దేన్నో పెట్టుకొన్నాడు. ఆ హోటల్ పెట్టిన నెలనుంచే అప్పులో, లోన్లో, రుణాలో, వాటికోసం వెతకడం మొదలుపెట్టాడు. సంవత్సరం గడిచిపోయింది. తండ్రిని మరిచిపోయాడు. పదిరోజుల క్రితం తండ్రికి బాగాలేదు అని కబురు చేస్తే, 'ఫలానా నేని అండ్ నేనిలో చేర్చండి, ఇదుగో ఇవాళో లోను శాంక్షన్ అయింది, అది తీసుకొని వస్తాను' అన్నాడు. హాస్పిటల్లో చేర్చిన నాలగో రోజున ముసలాయన




చచ్చిపోయాడు. ఆడమనిషి ఏడ్చుకొంటూ పెనిమిటి దగ్గరకు వెళ్లింది. ఫో! ఫో! లోనింకా రాలేదని కసిరాడు. ఫెడేల్మని కొట్టి తలుపు మూసుకొన్నాడు. "డెబ్భై వేలు కట్టండే శవాన్ని ఇవ్వనన్నారు" అంటూ ఏడ్చిందా ఆడమనిషి. కాసేపటికి తలుపు తీసి "ఇదుగో ఇట్లా నిముషాల్లో ఒక లోన్ తేనూ..." అంటూ చొక్కా తగిలించుకొని వెళ్లాడు. అంతే, అప్పటినుంచి అతని జాడ లేదు.

మార్చురీ గదిలో శవాన్ని గుర్తుపట్టింది ఆడమనిషి. పిల్లవాడు భయంతో బిగుసుకుపోయి గది బయటే నిలబడ్డాడు. "తాత శవాన్ని చూసి, కాళ్లకు దండం పెట్టుకొనిరా" అంటూ వాడి చెవులో గొణిగింది. తల్లి కళ్లలోకి దిగులుగా చూసి లోపలికి వెళ్లాడు కుర్రాడు. కుర్రాడు వెంట తెచ్చుకొన్న ప్లాస్టిక్ సంచీ లోంచి నాలుగు బంతిపూలు, గుప్పెడు గుండుమల్లెలు తీసి తాత కాళ్ల దగ్గర పెట్టాడు. వాడికి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. బాగా దుఃఖం వేసింది. కళ్లు తుడుచుకొని, శవం తల దగ్గరకు వెళ్లి, తాత నుదుటిపై గట్టిగా ముద్దు పెట్టుకొన్నాడు.

ఆశ్చర్యంగా, ఆరడుగుల శరీరం క్రమంగా కుంచించుకుపోయి, దోసిట్లో పట్టేంత పిట్టగా మారి, నీటిపిట్ట. చెరువులపై తిరిగేది (అది కూడా చచ్చిపోయే ఉంది). దాన్ని సంచిలో వేసుకొని బయటకు వచ్చాడు కుర్రవాడు. తల్లి మరోసారి శవాల గదివైపు చూసి, రెండు చేతులు జోడించి, కళ్లు తుడుచుకొని, "పద" అంటూ కుర్రవాడి చెయ్యి పట్టుకొని లాగింది. గదులన్నీ దాటుకొంటూ, పాలరాతి నేలపై అడుగులు వేసుకొంటూ...

"శవాన్ని ఎన్ని గంటలకు తీసుకెళతారు?" డాక్టరు అరిచాడు.

"మీరే ఉంచుకోండి సామి!" అంది ఏడుపు దిగమింగుకుంటూ. పిల్లవాడి చెయ్యి పట్టుకొని రోడ్డుపైకి నడిచింది ఆడమనిషి.

రోడ్డుపైకి వచ్చినాక సంచీని ఒకసారి తడుముకున్నాడు కుర్రాడు. పిట్టలేదు. మాయమైంది.

***

"థూ నీయవ్వ ఏడుపుగొట్టు కథలు..." అంటూ నాయన విసుక్కొని పొలంవైపు నడిచాడు. బయట మంచానికి నులక అల్లుతున్న తాత మాత్రం "సంచీలో పెట్టుకొన్న పిట్టేమయిందిరా, సుందరా!" అన్నాడు. కథ అక్కడితో అయిపోయింది. సుందరం తాత మాటలు కూడా ఆగిపోయాయి. సుందరం తాత కథ అయిపోయినాక మరింక మాట్లాడడు. "వాడికి బెమ్మజ్ఞానం ఉంది. మనకు వినబడని భాషలన్నీ వాడికి తెలుస్తాయి. వాడికి రహస్యాలు తెలుసు. జరగబోయేది తెలుసు. అన్నింటిని కథలుగా చెప్పటమే వాడి పని..." నాయనమ్మ మంచంలోంచి సన్నగా గొణిగింది.

బాగా చీకటి పడింది. ఆ రాత్రి పుట్టుకొక్కుల కూర చేసింది అమ్మ, సుందరం తాతకు ఇష్టమని. నాయన అట్లా రోడ్డు దాకా వెళ్లి వచ్చాడు. లాస్టు బస్సు వచ్చేవేళ. బీడీ కాల్చుకుంటూ రోడ్డు ఆ చివరిదాకా వెళ్లేడు. రోడ్డు చివర చెరువు. చెరువు గట్టున నాన్న ఈడువాళ్లే చేరి కబుర్లు చెప్పుకొంటూ ఉంటారు. మధ్యలో ఎవరో ఒక పద్యం అందుకుంటాడు. పద్యం తాలూకు రాగం ఊరు మొత్తాన్ని తాకుతుంది. చెవులకు కమ్మగా ఉంటుంది.

నాయన అక్కడ కూడా ఎక్కువ సేపు కూర్చోలేదు. చెరువు గట్టునే నడుచుకుంటూ కుమ్మరి వీధికి వెళ్లాడు. కుమ్మరి వీరేశం కొడుకు హైదరాబాద్ నుంచి వచ్చాడు. రెండు రోజులుగా వాడితో నాయన ఒకటే గుసగుస.

అన్నం ముందు కూర్చున్నాం అందరం. నాయన ఒక్కడే గడపలో కూలబడ్డాడు. సుందరం తాత అన్నం ముద్ద నోట్లో పెట్టుకొంటూ "ఒక సంగతి గుర్తుకొస్తుంది రా..." అంటూ కథ మొదలుపెట్టాడు.

"ముందు అన్నం తిని సావరా ముసిలోడా?" అంటూ నాయన విసుక్కొన్నాడు. కథ మొదలైంది.

***


రూపాయల స్పర్శలోని హాయి అనుభవంలోకి రావటం మొదలైంది మనోహరానికి.

456వ మనిషి దగ్గర అప్పు తీసుకొన్నాడు. ఐదు రూపాయల వడ్డీ. నెలనెలా వడ్డీ చెల్లించే షరతు. అప్పులు చెయ్యటం సహజమైన కార్యక్రమంలా మారింది. క్షణంసేపు ఆగి గతంలోకి తొంగి చూసుకొని, లేదా 455 మంది దగ్గర ఏమేమి షరతులతో అప్పు తీసుకొని లేదా మొదటిసారి సిటీకి వచ్చినప్పుడు, చేతిలో రెండు లక్షల రూపాయలు రెక్కల గుర్రంలా కనబడి, దిల్‌షుక్‌నగర్ సెంటర్లో కాఫీ దర్శినిని కొనుక్కొని, కాఫీ కలపటం నేర్చుకొని, ఎట్రాక్షన్ కోసం కౌంటర్‌లో ఆడమనిషిని కుదుర్చుకొని, సాయంకాలానికి వెయ్యికి పైగా మిగిలి, ఇక రూపాయల వాన కురిసినట్టే అనుకొని, బంజారాహిల్స్‌లో బ్రహ్మాండమైన మైదానాన్ని కలగని, దాంట్లో ఒక మేడను కూడా కలగని, రోజుకో పది ఇటుకలు పేర్చుతూ ఒక కలల ఇంటిని కడుతూ కడుతూ మనోహరానికి ఆశ చచ్చిపోలేదు. సిటీ మీద నమ్మకం పోలేదు. మైదానం మధ్యన ఇటుకలు పేర్చే కలను వదులుకోలేదు. రోజు పదివేల రూపాయలు వడ్డీ కోసం కట్టాలి. ఆ వడ్డీ కోసం మళ్లీ మళ్లీ అప్పులు చేస్తూ...

వరుసగా మూడోరోజు కూడా 456వ మనిషి దగ్గరే అప్పు తీసుకొన్నాడు. వాడి పేరు 'దిన'. షేర్లు అమ్మే వ్యాపారం. అరవ దేశం నుంచి పావలా డబ్బుతో వచ్చి ఇవాళ లక్షల్లో వ్యాపారం చేస్తున్నాడు. మనోహరానికి అదే ఆశ్చర్యం. ఇన్ని అందమైన కథల మధ్య, అతని కథే ఎందుకు విషాద భీభత్సమైందో అతనికి అర్థం కాలేదు.

పోలీసుల కిచ్చే లంచాలు, లావాటి, పొడవాటి ఒక గూండా కిచ్చే మామూలు, ఇవన్నీ తట్టుకొంటూ ఉండగానే, స్థలం అసలు ఓనర్ నంటూ ఒక మనిషి పదిమంది వస్తాదుల్ని వేసుకొని రావటం, ఎవరికి చెప్పుకోవాలో తెలియలేదు. పోలీసులు నవ్వారు. చుట్టుపక్కల చిన్న చిన్న కొట్లవాళ్లు వెర్రిగా చూశారు. పదివేల రూపాయలు కట్టి యూనియన్‌లో చేరితే సమస్యను పరిష్కరిస్తామని, చిన్న రెస్టారెంట్లు, టీ బంకుల రిజిస్టర్డు అసోసియేషన్ మనిషి వివరించాడు.

ఒకరోజు మనోహరం తన 480వ మనిషి దగ్గర అప్పు తీసుకొంటున్నప్పుడు, ఆ మనిషి పేరు 'డైలీ'. మార్వాడీ సేటు. ఐదు అంతస్థుల హోటలుంది అతనికి. ఐదురోజుల క్రితం, 'డైలీ'



సేటు అప్పు తీర్చలేక, అయిదో అంతస్థు పైనుండి క్రిందకు దూకి, ఒక మనిషి చచ్చిపోయిన స్థలం యిదేనంటూ మనోహరానికి చూపించారు. మనోహరానికి ఆ స్థలం చూసినప్పుడు కళ్లు తిరిగినట్లయి, వాంతి అయి, ఆ రోజంతా వికారంగానే ఉంది. ఏ క్షణమైనా అతను మేడపై నుండి కిందబడి, అతనిపై కలల ఇంటిలోని ఇటుకలన్నీ పడి మొదటిసారి సిటీ మరణస్థలంలా తోచింది.

800వ మనిషి (మనిషి కాదు, సహకార బ్యాంకు) దగ్గర అప్పు తీసుకొనే సమయానికి మనోహరం కలలన్నిటినీ ఒక్కొక్కటే చంపేసుకొన్నాడు. ఇల్లు వదిలి సంవత్సరం దాటింది. తల్లీ, భార్యా, పిల్లవాడు, ముసలి తండ్రి గుర్తు కొచ్చారు. అడ్రసు ఇవ్వకుండా ఒక ఉత్తరం రాశాడు. అతను అప్పు తీసుకొన్న 801వ మనిషి పేరు 'రోజ్'. ఆయనో కవి. 'సెల్ఫ్‌లైన్ పిల్లల కొక ఆశ', హోమ్ ఫర్ గోల్డెన్ (ఓల్డ్ ఏజ్) లాంటి ఎన్జీవోలకు ఆస్థానకవి. ఆ సంస్థల గురించిన కథలు, కవితలు రాసి నిత్యం ఏదో పత్రికలో వచ్చేలా చూడటం ఆయన పని.

ప్రేమ వదిలిపోయినప్పటి నుండి నాకు విశ్రాంతి లేదు/నగర సముద్రంలో మునిగినప్పటి నుండి నాకు నిద్ర లేదు అంటూ కవిత్వం చెబుతాడు. అయితే అప్పు వసూలు చెయ్యటంలో చాలా నిక్కచ్చిగా ఉంటాడు.

801 వ మనిషి రోజ్ దగ్గర వరుసగా పదోరోజు కూడా అప్పు చేశాడు మనోహరం. ఒక అప్పు తీర్చడానికి, మరో అప్పు చేస్తూ హోటల్‌లో వచ్చే డబ్బు తీసుకొని సాయంకాలానికి వడ్డీ తీర్చే పనిలో పడతాడు. ఒక సాయంకాలం అతనికి ఆశాతో పరిచయమైంది. 801వ మనిషి దగ్గర సెక్రటరీ. మనోహరంతో కలిసి హోటల్‌కు వచ్చింది. కబుర్లు చెప్పింది. కలిసి ఉందాం అని అడిగింది. ఆ రోజుకు ముందున్న ఏరోజు గురించీ మాట్లాడకూడదు అనేది ఆమె షరతు. ఆమె కళ్లలో కరుణ, దయ కనబడ్డాయి. ఆ కళ్లలోనే రక్తం, కన్నీళ్లు, మరణ భయం కూడా కనబడ్డాయి.

"పాపాయి పుట్టడాన్ని కలగన్నాను. ఎంత అందమైన ముఖం దానిది. సన్నగా, లేతగా, వెన్నంత మెత్తగా, అది కళ్లు మూసుకునే ఉంది. దాని ఊపిరి నా చేతికి తగులుతుంది. అదీ, నేనూ పొలాల మధ్యన నడుస్తూన్నట్లు."

"ఏంటయి"

"బంజారాహిల్స్, బంజారాహిల్స్‌లో ఇళ్లు. ఇళ్లలోని దీపాల వెలుగు అది. అక్కడో ఇంటిని కలగనాలి, అదీ కలంటే"

సరిగ్గా వారం రోజులకే ఆశ, మనోహరం విడిపోయారు.

"నువ్వు మనిషివి కాదు. కుళ్లిన శరీరానివి. రూపాయి నోటువి. స్టాంప్ పేపరువి. మనిషితో ముచ్చట చెప్పటం రాదు. కలిసుండటం రాదు. పక్కన పడుకొంటే చల్లగా, శవంలా, థూ..." అంటూ వెళ్లిపోయింది ఆశ.

1000వ మనిషి దగ్గర అప్పు చేస్తున్నప్పుడు 'నాయనకు హార్ట్ ఎటాక్ వచ్చింది. సిటీకి తీసుకొస్తున్నాం' అని కబురు వచ్చింది.

మనోహరానికి దుఃఖం వేసింది. ఊరు గుర్తుకొచ్చింది. పేడకుప్పలు, ముక్కవాసన వేసే ఇళ్లు. చిన్ననాటి ఆటలు గుర్తుకొచ్చాయి. పదేళ్ల

వయసులో చెరువుగట్టునున్న ఎద్దు ఒకటి కుమ్మింది మనోహరాన్ని. ఆ ఎద్దును నరికేస్తానంటూ రాత్రంతా వేటకత్తి పట్టుకొని తిరిగాడు వాళ్ల నాయన.

అప్పట్లోనే ఒక వేసవి సాయంకాలం, కాస్త జల్లుపడిన ఆకాశం. పొలంలో ఉన్నాడు మనోహరం. ఇళ్లకుపోయే ఆడకూలీలు, కబుర్లు చెప్పుకొంటూ, పాడుకొంటూ వెళుతున్నారు. ఆకాశం వైపు చేతులు చాపి 'ఓహో' అంటూ అరుస్తుండగా, తేనెటీగల గుంపు మనోహరం పై దాడిచేశాయి. ఎడమ కన్ను బంతిలా వాచింది. తడిగుడ్డతో ముఖాన్ని తుడిచి, అమ్మ ఒడిలో పడుకోబెట్టుకొని, ఏడుస్తున్న మనోహరాన్ని ఓదార్చడానికి సన్నటి పాటేదో పాడుతూ (అమ్మలందరికీ పాటలు ఎట్లా వస్తాయి?), వాళ్ల నాయన వచ్చి "ఏందిరా ఇది?" అంటూ ఏడుస్తూ భుజాన ఏసుకొని, పది కిలోమీటర్లు నడిచి టౌన్‌లో (తెనాలి) డాక్టరుకు చూపించాడు. అవన్నీ గుర్తుకొచ్చి మనోహరానికి దుఃఖం కలిగింది. అంతలోనే రేపు ఉదయాన్నే కట్టాల్సిన వడ్డీలు గుర్తుకొచ్చాయి. భయంతో బిగుసుకు పోయాడు.

నాలుగురోజులు పోయినాక, 1000వ మనిషి దగ్గరే మరోసారి, అప్పుకోసం వెళ్లి, కాదనిపించుకొన్నాక భార్య వచ్చింది. జుట్టంతా విరబోసుకొని, పెద్దగా ఏడుస్తూ, గుండెలు బాదుకొంటూ "మామ పోయాడయ్యా"అంది. ముఖంపై ఊడ్చి కొట్టినట్లు అయ్యింది.

"డెబ్బై వేలు ఇయ్యకపోతే శవాన్ని కూడా ఇయ్యరమ్మా" అంది.

"ఇదుగో అప్పు, లోన్, లోన్..." అంటూ గొణిగాడు.

"దిక్కుమాలిన అప్పు, కుటుంబాన్ని నాశనం చేశావు గదయ్యా" ఏడుస్తూనే ఉంది.

మనోహరానికి కోపం వచ్చింది. ఉన్నపాటున్న భార్యను ఫెడేల్‌మని కొట్టి, జుట్టు పట్టుకొని బయటకు తోసి, తలుపు వేసుకొని క్షణం సేపు తరువాత తను ఏం చేశాడో అర్థమై ఉలిక్కిపడ్డాడు. ఒణికిపోయాడు.

ఆయాసంతో, ఊపిరాడనితనంతో గిలగిలలాడాడు. గుండెల్లో సన్నాగా నొప్పి గదిలోకి వెళ్లి ముఖం కడుక్కొన్నాడు. అద్దంలో చూసుకొన్నాడు. ఎవడో కొత్త మనిషి. నీలపు కళ్లు, లావాటి ముక్కు, బట్టతల, తెల్లటి గడ్డం. పాలిపోయిన ముఖం. కళ్ల చుట్టూ నల్లని వలయాలు. తనని తాను జాలితో పరిశీలించుకొన్నాడు. అట్లా గంటసేపు అద్దంలో చూసుకొంటూనే ఉన్నాడు. ఉన్నట్టుండి ఫెడేల్‌మని చెంపపై కొట్టుకొన్నాడు. అట్లా కొట్టుకుంటే, నొప్పికి బదులు హాయిగా ఉండటం.

"ముసిల్దా కొడుకును పిలిచి కథలు చెప్పిస్తావా? ఆ నా కొడుకు చావు కథలు, ఏడుపు కథలు చెప్పి బెదిరిద్దామనుకొంటున్నాడేమో! ఇట్లాంటి కథలు చాలా విన్నాను. సుఖపడతానురా మగడా అంటే కళ్లల్లో నిప్పులు పోసుకుంటారే అందరూ"

మనోహరం ఆశ్చర్యపోయాడు. మళ్లీ మళ్లీ మళ్లీ. కాసేపయినాక బ్లేడుతో చెయ్యిపై కోసుకున్నాడు. నొప్పికి బదులు సమ్మగా ఉండటం తెలిసింది. చేతిపై కారుతున్న రక్తాన్ని చూసుకొంటూ నిశ్శబ్దంగా అద్దంలో ఉన్న తన రూపురేఖల్ని గమనిస్తూ నిలబడ్డాడు మనోహరం.

***

"ఒరేయ్, ముసిలోడా, ఏందిరా ఏ దిక్కుమాలిన కథ. తండ్రి పోయాడంటే వినిపించుకోని కొడుకుంటారురా!" అన్నాడు నాయన కోపంగా అన్నం కంచాన్ని నేలకేసి కొడుతూ. సుందరం తాత ముఖంలో ఏ భావం లేదు.

రాత్రికి సుందరం తాత, నేను మిద్దెపై పడుకొన్నాం. నా పొట్టపైన చెయ్యివేసి, ఆకాశం కేసి చూస్తూ నక్షత్రాల గురించి ఒక కథ చెప్పాడు తాత. నక్షత్రాలన్నీ కోపంతో రాళ్లు విసిరితే, సూర్యుడి పక్కటెముకలు విరిగిపోయాయి. రాళ్లెందుకు విసిరారంటే 'నేను వెలుగు ఇస్తున్నాను. నేనిచ్చే వెలుక్కి గంట కింతని కట్టండి' అని సూర్యుడు ఆర్డరేశాడు. నక్షత్రాలన్నీ ఆకాశం మధ్యలో చేరి, అరిచి, కేకలు వేసి రాళ్లు వేసి సూర్యుడికి పక్కటెముకలు విరిగిన విషయం చెబుతుండగా కింద తాత, నాయన పోట్లాడుకుంటున్నారు.

"ముసిల్దా కొడుకును పిలిచి కథలు చెప్పిస్తావా? ఆ నా కొడుకు చావు కథలు, ఏడుపు కథలు చెప్పి బెదిరిద్దామనుకొంటున్నాడేమో! ఇట్లాంటి కథలు చాలా విన్నాను. సుఖపడతానురా మగడా అంటే కళ్లల్లో నిప్పులు పోసుకుంటారే అందరూ" నాయన పెద్దగా రంకెలు వేస్తున్నాడు.

సుందరం తాత కథను ఆపలేదు. విరిగిన సూర్యుడి పక్కటెముకలకు, తెల్లచర్మం రాక్షసుడు కట్టు కట్టాడు. ఆ కట్టు నెలరోజులుందట. ఆ నెలరోజులూ భూమిపైన వెలుతురే లేదు. సుందరం తాత కథ చెబుతూనే ఉన్నాడు. నాకు మధ్యలోనే నిద్ర పట్టింది.

మరుసటి రోజంతా సుందరం తాత గమ్మున ఉండిపోయాడు. కథలు చెప్పే కోరిక చచ్చిపోయింది. కథ ఆయన నాలుకపై నుంచి ఎగిరి ఇంకో కథల మనిషిని చేరింది. సుందరం తాత ఒక్కడే పొలాలవైపు బయలుదేరాడు. అన్నీ ఎండిపోయి, భూమి నెర్రలిచ్చి ఉంది. పొలం గట్లపై నున్న సుందరం తాతకు తెల్లని మేఘం, ఆకులు లేని ఒంటరి తాటిచెట్టు, చెట్టుపైన కితకితమంటున్న ఉడతలు ఎదురైనాయి. అట్లా చాలా దూరం నడిచి ఒక జమ్మిచెట్టు మొదట్లో కూలబడ్డాడు. కొత్త కథ ఇంకా ఆయనపై వాలలేదు. పెదపాలెంలో గవర్నమెంటోళ్లు ఎండుగడ్డి ఇస్తావుంటే అమ్మ, నేను బయలుదేరాము. పొలంగట్ల పైనున్న సుందరం తాత కనబడ్డాడు. ఎక్కడికి, ఎక్కడికి అని అడిగి, పద్మ నేనూ వస్తానని బయలుదేరాడు. అప్పటికి సుందరం తాత భుజంపై కథ వాలింది.

0000

మన కథలో ఒక ముసిలోడు, ముసిల్ది ఉన్నారు. "అంటే మన తాత, నాయనమ్మలేనా?" అన్నాను నేను. (మధ్యలో అడ్డు రావద్దు) వాళ్లకు ఒక కొడుకు, కోడలు, మనమడు, పాడె ఆవు, రెండు ఎద్దులు, రెండెకరాల భూమి ఉన్నాయి.

కథను చెరువు గట్టున మొదలుపెడదాం.

ఒకప్పుడది అందమైన చెరువే. పొద్దున్నే ఒక హరిదాసు అక్కడ కూర్చుని నామాలు దిద్దుకుంటుంటే, కావిళ్లు వేసుకొని మగవాళ్లు నీళ్లకోసం వస్తూంటే, పూజలకోసం వచ్చే ఆడవాళ్లు, పొద్దుటిపూట బస్సుకోసం ఆగిన జనం, అమ్మకానికి తెచ్చిన నారుమళ్లను తడుపుతూ తూర్పు నుంచి వచ్చిన జనం, చిడతలు వాయించుకొంటూ హరిదాసు బయలుదేరటం అంతా కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది.

ఇప్పుడా చెరువులో నీళ్లు లేవు. హరిదాసులు, జంగంవాళ్లు ఇప్పుడా ఊరికి రావటం లేదు. కథ మొదలైన రోజున చెరువుగట్టు గొడవ గొడవగా ఉంది. చెరువుగట్టున వరుసగా గడ్డి కుప్పలున్నాయి. రాయలసీమకు పంపడానికి సేకరించిన కుప్పలు. ఎమ్మార్వో, గ్రామ పంచాయతీ మనుషులు, డ్వాక్రా వోళ్లు హడావుడిగా తిరుగుతున్నారు. చెరువుకు ఇంకోవైపు మందలు మందలుగా పశువులు. ఆకలితో ఉసూరంటున్న పశువులు. సంతకు కాస్త దూరంలో రెండు టాటా సుమోలు. తెనాలికి చెందిన సేట్‌లు. రడీ క్యాష్‌తో సూట్‌కేసులు పట్టుకొని అక్కడ నుంచున్నారు. అమ్మకానికైనా,

అప్పుకైనా రెడీ. లక్షా యాభైవేలు పలికే పొలం యాభైవేలకయితే అక్కడికక్కడే బేరం ఖరారు. లేదా పొలం తాకట్టుపై అప్పయినా. పదిరూపాయలు వడ్డీ. వడ్డీలు బదులు గింజలు కొలవాలి. అవసరమైన దస్తావేజులు రాతగాళ్లు, సాక్షులు అక్కడే రెడీ. అయిదు నిముషాల్లోనే డబ్బు. డబ్బే కాదు, పశువులకు పచ్చగడ్డీ కావాలన్నా, వానలపై ఆశలు చావని వాళ్లకు విత్తనాలు, మందులు కూడా సిద్ధం.

సరే కథలోకి వద్దాం. కథలోని మనోహరం ఈ చెరువుగట్టున తచ్చాడుతున్నాడు. పొడవుగా, నల్లగా బలిష్టమైన శరీరం. కొద్దిగా నెరిసిన జుట్టు. ముఖంలో దిగులు. తల్లి ప్రాణం మీదకొచ్చి ఇప్పుడా, కాసేపా అన్నట్టుంది. అదొక దిగులు. అసలు దిగులు రెండు నెలలుగా హైదరాబాద్ పోవాలని ప్రయత్నం. పొలాలన్నీ అమ్ముకొని, ఆ డబ్బుతో ఏ హోటల్లో పెట్టుకుంటే, ముసలాయన సాగనివ్వటం లేదు.

"రండి, మనోహరం సార్! వెంకయ్య కొడుకు కదా మీరు. ఎంత డబ్బు కావాలి. పొలం కాగితాలేమైనా తెచ్చారా?" సేటు పిలిచాడు. గత నాలుగు ఆదివారాలుగా ఇదే జరుగుతుంది. బొడ్లో పొలం కాగితాలు దోపుకొని, చెరువు చుట్టూ తిరగటం. ఈ రోజు ఇక తెగించి కాగితాలు సేట్ కిచ్చాడు. తాను సంతకం పెట్టి, ముసలాయన బదులు వేలిముద్ర కూడా తానే వేసి

ఇంటి దగ్గర గొడ్లకు మేపు తోముతూ, కుడితి కలుపుతూ ముసలాయన. లోపల ముసలమ్మ పెద్దగా మూలుగుతోంది. ఎగశ్వాసతో దేహం అంతా వణికిపోతోంది. మాటి మాటికీ లోపలికి వెళ్లి ముసలమ్మను పలకరించి వస్తున్నాడు. పక్షవాతం, మందులు వాడడం తప్ప మరేం చెయ్యలేమన్నారు తెనాలి ఆస్పత్రిలో. మనోహరం ఇంటి ముందు తచ్చాడుతున్నాడు.

'అంత తాపీగా ఎట్లా ఉండగలుగుతున్నాడు!' అని గొణుక్కొని లోపలికొచ్చాడు ముసలాయన.

కళ్లు తెరుస్తూ మూస్తూ, కళ్లు తెరిచినప్పుడల్లా కలేదో చెదిరినట్లు ఉలికిపడుతుంది ముసలమ్మ. తెల్లటి ముఖం. విశాలమైన నుదురు. ఆ ముఖం లోని తెల్లటి పావురాలేవో లేచి రెక్కలు విప్పుకొని పైకి లేస్తున్నట్లు. బయట మనోహరం బీడీ ముట్టించుకొని, రోడ్డుపై పచార్లు చేస్తున్నాడు. చెరువు దాకా వెళ్లాడు. సంత ముగిసింది. చెరువిప్పుడు ఖాళీగా ఉంది. చెరువుపై కుర్రాళ్లు మూగారు. ఒకడు హరిశ్చంద్రలోని కాటిసీను పద్యం అందుకున్నాడు. చెరువు పక్కన నీళ్లబావి దగ్గర తెలిసిన ఆడమనిషి కనబడి అటు వెళ్లాడు. గవళ్ల వీరయ్య కోడలు. నీళ్లతో తడిసిన శరీరం, నీటిపక్షిలా మిలమిలలాడుతోంది.

ముసలమ్మ పడుకొన్న మంచం పక్కన గోడపై ఒక పాత ఫొటో. పాతికేళ్ల క్రితం తెనాల్లో దిగింది. కొడుకును ఒళ్లో కూర్చోబెట్టుకొని వాళ్లిద్దరూ దిగిన ఫొటో. తల చుట్టూ జరీ కండువ చుట్టి, గుబురు మీసాల్ని సవరించుకొంటూ ముసలాయన. ఆయన పక్కనే సన్నని దీపంలా మిలమిలలాడుతున్న ముసలమ్మ. ఆ ఫొటోను ఎందుకో చాలాసార్లు చూసుకున్నాడు ముసలాయన. కిందకు దించి శుభ్రంగా తుడిచి మళ్లీ తగిలించాడు. చీకటి పడేదాక ముసలమ్మ పక్కనే కూర్చున్నాడు. మెల్లగా ఆమె పాదాల్ని వత్తుతూ అట్లాగే నిద్రపోయాడు.

ఆ చీకట్లోనే, ఇంకా రోడ్డుపై తచ్చాడుతున్నాడు మనోహరం. చెరువు గట్టు దగ్గరకు వెళ్లాడు. చీకటి బాగా ముసిరింది. జనం అలికిడి తగ్గింది. బీడీ వెలిగించుకొని గుప్పు గుప్పుమంటూ పొగలు వదులుతున్నాడు. అతనికి గొప్ప హుషారుగా ఉంది. హైదరాబాద్ అందమైన ఆడమనిషిలా ఊరిస్తుంది. బావి దగ్గర గాజుల చప్పుడు. వీరయ్య కోడలు నీళ్లు తోడుతూ. బిందెతో నీళ్లు తోడుకొని పైన బోసుకొంది. చెరువులో ఈదే నీటిపిట్టలా ఉంది.

మనోహరానికి ఎందుకో ఆ ఆడమనిషిని ముట్టుకోవాలనిపించింది. ఒళ్లంతా హుషారుగా, తేలిపోతున్నట్లుగా వుంది. "కాస్త చుట్టుపక్కల చూసుకోవే!" అని కేక వేశాడు. సన్నగా నవ్వింది. తడిసిన చీరకొంగు గాలిలో ఎగురుతోంది. బావిగట్టు వైపు నడిచాడు మనోహరం. మట్టి, తడి, మురికి ఆ రాత్రి భార్యతో కాకుండా మరో స్త్రీతో గడిపాడు.

ఆ రాత్రి పల్లెలో మనోహరం గడిపిన చివరి రాత్రి. తండ్రికి చెప్పలేదు. భార్యకు చెప్పలేదు. పట్నం వెళ్లిన నెలకు ఉత్తరం రాసాడు. హోటలన్నాడు. బంజారాహిల్స్‌లో పెద్ద మేడ అన్నాడు. ఆరో నెలలో మరో ఉత్తరం రాశాడు. ఈసారి లోన్లు, బ్యాంకులు, వడ్డీలు అంటూ దిగులు కబుర్లు రాశాడు. ఆ తరువాత ఉత్తరం కూడా లేదు. తండ్రి చావుకు కూడా రాలేదు. సంవత్సరం తరువాత కోర్టు నోటీసు, సమన్లు వచ్చాయి. మనోహరం జాడ మాత్రం తెలియలేదు.

ఇప్పుడు మనోహరం ఎక్కడ ఉన్నాడు?

పగలంతా కూలీపనులకు వెళ్లి, రాత్రి బ్రిడ్జి పక్కన ప్లాస్టిక్ గోతాలతో కట్టుకొన్న గుడిసెలో ఉంటాడు. బాగా మాసిన గడ్డం, దువ్వని తల, ఎన్నడూ ఉతకని చొక్కా, అతను మనిషిలా కాక, పనిముట్టులా రోడ్లపై కదులుతుంటాడు.

ఒక మధ్యాహ్నం బిల్డింగ్ పనులు చేస్తూ, ఇటుకలు మోస్తూ, మేడపై నుండి జారిపడి మెదడులో రక్తనాళాలు చిట్లాయన్నారు. వారంరోజులు హాస్పిటల్‌లో ఉన్నాడు.

హాస్పిటల్‌నుంచి వచ్చిన తరువాత అతని మాట తీరు మారిపోయింది. ఆలోచనకు, మాటకు లింక్ తెగిపోయింది. ఏదో మాటను చెప్పాలనుకొని దానికి బదులు గవర్నమెంటు అనే మాటను వాడతాడు. "మా ఊరు వెళ్లిపోయి, కొత్తది వల ఒకటి కొనుక్కొని, గవర్నమెంటు ఒడ్డున కూర్చుని చేపలు పట్టుకోవాలి" అనేవాడు. ఇంకోసారి "కాస్త వర్షాలు పడితే ట్రాక్టరు అద్దెకు తెచ్చుకొని, గవర్నమెంటును దున్నాలయ్యా" అనేవాడు.

ఇప్పుడతని మాటల్లో చాలా వాటికి పర్యాయపదంగా గవర్నమెంటు వినబడుతుంది. ఊరి పేరంటే గవర్నమెంటుపాలెం అనేవాడు. గతాన్ని గురించి చెబుతూ "రెండు లక్షల ఖరీదు చేసే హోటల్ని గవర్నమెంటు లాక్కుపోయింది. ఎవరికి కంప్లయింటు ఇవ్వమంటారు?" అని అడిగేవాడు. అతన్ని ఇప్పుడందరూ 'గవర్నమెంటయ్య' అని పిలుస్తారు.

కథ పూర్తవుతుండగానే ఇంటికి వచ్చాము. బయట నల్లటి చీకటి. నిద్రపోయే పశువుల కల్లాగా, మహా కుంభవృష్టిని తెచ్చే మేఘంలాగా ఉంది చీకటి. తొట్టి పక్కన కూర్చుని అమ్మ కంచాలు, గిన్నెలు కడుక్కుంటోంది. నాయనమ్మ కోసం మంచం, పక్క అమరుస్తున్నాడు తాతయ్య. అరుగుపై తలపై చేతులు పెట్టుకొని కూర్చున్నాడు నాయన.

బయటకు వెళ్లి "నాయనా" అని అరిచాను.

"ఏంట్రా ఎంకటి" అన్నాడు ప్రేమగా.

"ఏం లేదు, ఊరికినే..." అన్నాను బింకంగా. ఎందుకో దిగులు వేసింది. ఏడుపు కూడా వచ్చింది. వెళ్లి నాయన పక్కన కూర్చున్నాను. ఎక్కడా చప్పుడు లేదు. లోపల సుందరం తాత గొంతు సన్నగా వినిపిస్తోంది.

"తలనొప్పి మందు ఇయ్యమంటావా?" అన్నాను నాయనతో. నాయన ఏం మాట్లాడలేదు. లేచి నాలుగు అడుగులు ముందుకు నడిచాడు. చీకటిలో కలిసిపోయినట్లుగా నాయన కనబడలేదు. సుందరం తాత మరో కథ మొదలు పెట్టాడు. రాత్రి కొనసాగుతోంది. ■

కె. శివారెడ్డికి
.. ప్రేమతో....